
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



శుభస్య శీఘ్రం

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో అభ్యర్థులు సెంటిమెంట్ జోడిస్తున్నారు. ముహూర్తం నిర్ణయించుకుని మరీ నామినేషన్లు వేస్తున్నారు. – 8లో




డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
43.0° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	43.0	26.0
కాకినాడ	37.9	27.6
అమలాపురం	40.0	27.0

పాత కొత్తల పోల్‌వార్



- కోనసీమలో పోరు రసవత్తరం
- పలు చోట్ల సీనియర్లతో జూనియర్లు..
- ఇంకొన్ని చోట్ల అధికారం కోసం అధికారులు
- మరికొన్ని చోట్ల పాత వైరం పునరావృతం
- ఒకచోట ఆసక్తిగా వారసుల పోరు

సాక్షి, అమలాపురం: రాష్ట్ర రాజకీయాలలో కోనసీమకు ఒక ప్రత్యేకత ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో భాగంగా ఉన్నప్పుడు.. ఇప్పుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా ఏర్పడిన తరువాత కూడా ఈ ప్రాంతం రాజకీయంగా తన ప్రాధాన్యాన్ని మరింత పెంచుకుంది. ఈ ప్రాంతం నుంచి ఎంతోమంది రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో రాణించారు. లోక్‌సభ స్పీకర్, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు, రాజ్యసభ సభ్యులు, శాసన మండలి సభ్యులుగా విశిష్ట సేవలందించినవారు ఎంతోమంది. అటువంటి కోనసీమలో ఈసారి సార్వత్రిక ఎన్నికలలో ప్రధాన పోటీ అధికార వైఎస్సార్ సీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేనల మధ్యనే. ఆయా పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించాయి. వారు ప్రజాక్షేత్రంలో ప్రచారం చేసుకుంటున్నారు. ఈసారి ఎన్నికలలో పలు నియోజకవర్గాలలో పాత ప్రత్యర్థులు.. మరికొన్ని చోట్ల సీనియర్లతో జూనియర్లు.. ఇంకొన్ని చోట్ల తొలిసారి పోటీ పడుతున్న వారితో పాత, కొత్త మేళవింపు కనిపిస్తోంది. వీరి మధ్య ఎన్నికల పోరు రసవత్తరంగా సాగనుంది.

పి.గన్నవరం

అధికారానికి అధికారుల తొలిపోరు.. విప్పర్తి–గిడ్డి


విప్పర్తి వేణుగోపాలరావు


గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరంలో పోటీపడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణరావులు శాసనసభకు పోటీ చేయడం ఇదే తొలిసారి. పైగా వీరిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేశారు. వేణుగోపాలరావు సాగునీటిపారుదల శాఖలో ఏఈఈ నుంచి ఎస్‌ఈ వరకు పనిచేశారు. రిటైర్ అయిన తరువాత 2002 నుంచి క్రియాశీలక రాజకీయాలలో ఉన్నారు. ప్రస్తుతం జెడ్పీ చైర్మన్‌గా ఉన్నారు. గిడ్డి సత్యానారాయణ తెలంగాణ పోలీసు శాఖలో గణాంక విభాగంలో అధికారిగా పనిచేశారు. ఇటీవల రాజకీయాలలో చేరి పోటీలో నిలబడ్డారు.

రామచంద్రపురం

వారసులుగా తొలిసారి బరిలో.. సూర్యప్రకాష్–సుభాష్


పిల్లి సూర్యప్రకాష్


వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం నియోజకవర్గం **నుంచి వైఎస్సార్** సీపీ తరఫున **పోటీ చేస్తున్న పిల్లి** సూర్య ప్రకాష్, **టీడీపీ నుంచి పో**టీపడుతున్న వాసంశెట్టి సుభాష్ శాసనసభ్యులుగా పోటీ **చేయడం ఇదే తొలి**సారి. వీరిద్దరికీ రాజకీయ వారసత్వం కూడా ఉండడం విశే**షం. సూర్యప్రకాష్** తండ్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ ఇదే నియోజకవర్గం నుం**చి మూడుసార్లు** ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు దివంగత వైఎస్ రాజశేఖర **రెడ్డి, ప్రస్తుత ము**ఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. సుభాష్ తాత, తండ్రి, తల్లి అమలాపురం మున్సిపాలిటీ కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు.

అమలాపురం పార్లమెంట్

సీనియర్‌తో జూనియర్ పోటీ.. రాపాక–హరీష్


రాపాక వరప్రసాదరావు


గంటి హరీష్ మాధుర్

అమలాపురం పార్లమెంట్ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున రాజోలు సిటింగ్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పోటీ పడుతున్నారు. టీడీపీ నుంచి గంటి హరీష్ మాధుర్ పోటీలో ఉన్నారు. రాపాక ఇప్పటికే రాజోలు నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి 2019లో జనసేన పార్టీ నుంచి గెలిచారు. ఎమ్మెల్యేగా చేసిన ఆయన ఎంపీగా తొలిసారి బరిలో నిలిచారు. హరీష్ గత ఎన్నికల్లో ఎంపీగా టీడీపీ నుంచి పోటీ చేశారు. ఆయన రెండో సారి బరిలో నిలబడనున్నారు. హరీష్ దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కుమారుడు.

కొత్తపేట

ఐదోసారి జగ్గిరెడ్డి–బండారు పోరు


చిర్ల జగ్గిరెడ్డి


బండారు సత్యానందరావు

కొత్తపేట నియోజకవర్గంలో పాత ప్రత్యర్థుల మధ్య మరోసారి ఎన్నికల పోరు జరగనుంది. ప్రస్తుత ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ తరఫున మూడోసారి పోటీ చేయనున్నారు. 2014, 2019లో ఈ పార్టీ తరఫున పోటీ చేసిన రెండుసార్లూ ఆయన విజేతగా నిలిచారు. తొలిసారి కాంగ్రెస్ పార్టీ తరఫున 2004లో పోటీ చేసి గెలిచిన ఆయన 2009లో అదే పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బండారు సత్యానందరావు 1994 నుంచి వరుసగా పోటీ చేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు జరిగే ఎన్నికలతో కలిపి ఈ నియోజకవర్గం నుంచి ఇది ఏడోసారి తలపడుతున్నారు. 1994, 1999లో టీడీపీ తరఫున గెలిచిన సత్యానందం, 2009లో పీఆర్పీ తరఫున ఆయన గెలిచారు. వీరిద్దరూ ముఖాముఖిగా ఇది ఐదోసారి పోటీ పడుతున్నారు.

అమలాపురం

మూడోసారి పోటీలో విశ్వరూప్–ఆనందరావు


పినిపే విశ్వరూప్


అయితాబత్తుల ఆనందరావు

జిల్లా కేంద్రం అమలాపురం అసెంబ్లీ నుంచి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఇదే నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీ పడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత నుంచి ఇక్కడ మంత్రి విశ్వరూప్, టీడీపీ అభ్యర్థి ఆనందరావు తలపడుతున్నారు. 2009, 2019లో వీరిద్దరి మధ్య జరిగిన ఎన్నికల పోటీలో విశ్వరూప్ గెలవడం, మంత్రిగా పనిచేయడం విశేషం. తాజాగా జరిగే ఎన్నికలతో ఇది మూడోసారి కానుంది. తాజాగా జరగనున్న ఎన్నికల్లో మరోసారి ఆనందరావుపై గెలిచి హ్యాట్రిక్ సాధించాలని విశ్వరూప్ పట్టుదలతో ఉన్నారు.

ముమ్మిడివరం

రెండోసారి బరిలో పొన్నాడ–దాట్ల


పొన్నాడ వెంకట సతీష్ కుమార్


దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, టీడీపీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పోటీ పడడం వరుసగా ఇది రెండోసారి. పొన్నాడ 2009 ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. తరువాత ఎన్నికలకు దూరంగా ఉన్న ఆయన 2019లో పోటీ చేసి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో తొలిసారి పోటీ పడి గెలిచిన బుచ్చిబాబు 2019 ఎన్నికలలో ఓటమి పాలయ్యారు.

మండపేట

తొలిసారి బరిలో తోట–వేగుళ్ల


తోట త్రిమూర్తులు


వేగుళ్ల జోగేశ్వరరావు

రాజకీయంగా సీనియర్లుగా పేరొందిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఒకరిపై ఒకరు పోటీ పడడం ఇదే తొలిసారి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండపేట నుంచి పోటీ చేయడం ఇదే తొలిసారి కాగా, 1994 నుంచి ఇప్పటి వరకు ఏడుసార్లు పోటీ రామచంద్రపురం నుంచి పోటీ చేశారు. ఇది ఎనిమిదోసారి ఎన్నిక కావడం గమనార్హం. వేగుళ్ల జోగేశ్వరరావుకు ఇది ఐదోసారి ఎన్నిక. 2004లో ఆలమూరు నుంచి పోటీ చేసి ఓడిపోయిన జోగేశ్వరరావు నియోజకవర్గ పునర్విభజన తరువాత 2009, 2014, 2019లలో మండపేట నుంచి వరుసగా టీడీపీ తరఫున పోటీ చేసి గెలిచి హ్యాట్రిక్ సాధించారు. ఇప్పుడు ఐదోసారి తలపడుతున్నారు.

రాజోలు

సీనియర్‌తో జూనియర్.. గొల్లపల్లి–దేవ వరప్రసాద్


గొల్లపల్లి సూర్యారావు


దేవ వరప్రసాదరావు

రాజోలులో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తుండగా, బ్యూరోక్రాట్ నుంచి కొత్తగా రాజకీయాలకు వచ్చిన దేవ వరప్రసాద్ జనసేన నుంచి పోటీ చేస్తున్నారు. గొల్లపల్లి అల్లవరం, ముమ్మిడివరం, రాజోలు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడం ఇది ఏడవసారి కాగా, దేవ వరప్రసాద్‌కు తొలిసారి. గొల్లపల్లి దివంగత ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర్ రెడ్డిల మంత్రివర్గంలో రెండుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది.

న్యూస్‌రీల్

బాలాజీ స్వామికి రూ.2.17 లక్షల ఆదాయం


అప్పనపల్లిలో స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం భారీగా భక్తులు తరలివచ్చారు. శ్రీ, భూ సమేత బాల బాలాజీ స్వామిని దర్శించిన భక్తులు అమితానందం పొందారు. నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీ నారాయణ హోమాన్ని వేద పండితులు వైభవంగా జరిపించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2.17 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.59 లక్షల ఆదాయం లభించిందన్నారు. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.58,493 విరాళంగా అందించారన్నారు. 3,296 మంది స్వామివారిని దర్శించుకున్నారని, 2,371 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

జిల్లాలో మూడో రోజు 8 నామినేషన్ల దాఖలు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో శనివారం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదుగురు అభ్యర్థుల నుంచి 8 నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా మీడియా కేంద్రం ద్వారా ఆ వివరాలు తెలియజేశారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం ఆర్డీవో కార్యాలయంలో వైఎస్సార్ సీపీ తరఫున పిల్లి సూర్యప్రకాష్ ఒక సెట్టు నామినేషన్ పత్రాలను, స్వతంత్ర అభ్యర్థి కాటే సుబ్రహ్మణ్యం ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్‌కు సమర్పించారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జై భారత్ నేషనల్ పార్టీ తరఫున వనచర్ల బాబ్జీ ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో ఎస్‌డీసీ మదన్‌మోహనరావుకు సమర్పించారు. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్ మూడు సెట్ల నామినేషన్ పత్రాలను జేసీ, ఆర్వో ఎస్.నూపుర్‌అజయ్‌కు అందించారు. పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి మాకే దేవి ప్రసాద్ రెండు సెట్లు నామినేషన్ పత్రాలను ఆర్వో, జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తికి దాఖలు చేశారు. అమలాపురం, మండపేట, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్లు దాఖలు కాలేదని ఆయా పరిధి ఆర్వోలు జి.కేశవవర్ధనరెడ్డి, డీటీఎస్ ఎల్లారావు, జీవీవీ సత్యనారాయణ తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

రూ.3.46 లక్షల నగదు సీజ్


మండపేట ప్రాంతంలో నిఘా బృందాలు సీజ్ చేసిన నగదు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఓటర్లను మభ్యపెట్టే ఇతర వస్తువుల అక్రమ రవాణాను చెక్ పోస్టుల్లో జరుగుతున్న విస్తృత తనిఖీలు, దాడులతో అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లా పోలీసు శాఖ, ఎస్‌ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ నిఘా బృందాలు ఈ అక్రమ రవాణాను కనిపెడుతున్నాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా పర్యవేక్షణలో ఈ తనిఖీలు, దాడులు జరుగుతున్నాయి. జిల్లాలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన తనిఖీలు, దాడుల్లో పట్టుబడ్డ నగదు, మద్యం, అరెస్టులు తదితర విషయాలను ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో వివరించింది.

- మండపేట రూరల్ మండలం జెడ్.మేడపాడు వద్ద ఓ వాహనాన్ని తనిఖీ చేసి రూ.2.46 లక్షల నగదు సీజ్ చేశారు. అలాగే మండపేట పట్టణంలో ఓ వాహనంలో అక్రమంగా రవాణా అవుతున్న రూ.లక్ష నగదును సీజ్ చేశారు.
- అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3 పందెం కోడి పుంజులు, 3 కోడి కత్తులు, 3 మోటారు సైకిళ్లు, రూ.520 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం ఎస్‌ఈబీ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించి 9 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 69 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 12.99 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులైన జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేట వద్ద శనివారం విస్తృత తనిఖీలు జరిగాయి.
- ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరధిలో ఎనమదల, తాడిపల్లి, కాపవరం, పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో సుందరపల్లి, ఊడుమూడి, తామరపల్లి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిధుల్లో పోలీసు అధికారులతో పాటు కేంద్ర బలగాలు శనివారం సాయంత్రం కవాతు నిర్వహించారు.

కనకాలపేటలో అత్యధిక పోలింగ్

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఉన్న యానాంలో శుక్రవారం జరిగిన పోలింగ్‌లో అత్యధికంగా కనకాలపేట 7వ పోలింగ్ స్టేషన్‌లో అత్యధిక ఓట్లు పోలవగా, అత్యల్పంగా దొమ్మేటిపేట 26వ పోలింగ్‌స్టేషన్‌లో నమోదయ్యాయి.

మెట్టకూరులో 1364 ఓట్లకు గాను 1068 ఓట్లు, మెట్టకూరు 2వ పోలింగ్ స్టేషన్‌లో 1252 ఓట్లకు గాను 1057 ఓట్లు, వంశీకృష్ణ కాలనీ 3వ పోలింగ్‌స్టేషన్‌లో 1407 ఓట్లకు గాను 1033 ఓట్లు, అంబేడ్కర్‌నగర్ 5వ పోలింగ్ బూత్‌లో 1155 ఓట్లకు గాను 835 ఓట్లు, గోపాల్‌నగర్ బూత్‌లో 1380కు 998 ఓట్లు, మార్కెట్ కమిటీ బూత్‌లో 1371కు 793ఓట్లు, కనకాలపేట హైస్కూల్‌బూత్‌లో 1403కు 1144 ఓట్లు, ప్రాథమిక పాఠశాల బూత్‌లో 1192 ఓట్లుకు 936ఓట్లు, యూకేవీ నగర్‌లో 903కు 718 ఓట్లు, భీమ్‌నగర్‌లో 1264 ఓట్లకు 993 ఓట్లు, సుబ్రహ్మణ్యభారతివీధిలో 1336కు 1011 ఓట్లు, ఎంజీజీ హైస్కూల్‌లో 998కు 666 ఓట్లు, జాకిర్‌హుస్సేన్ పాఠశాలలో 1248కు 874 ఓట్లు, జూనియర్ కాలేజీలో 1334కు 893 ఓట్లు, పీడబ్ల్యూడీ కార్యాలయంలో 1217 ఓట్లకు 930 ఓట్లు, మినీ సివిల్‌స్టేషన్‌లో 1295కు 1042 ఓట్లు, మున్సిపాలిటీలో 1203కు 997, కేఎన్‌జీజీ స్కూల్‌లో 1358కు 959, పైడికొండలవీధిలో 1333కు 1056, కురసాంపేటలో 1213కు 1005, ప్రైమరీ స్కూల్‌లో 1195కు 960, అయ్యననగర్‌లో 1070కు 904, దొమ్మేటిపేటలో 784కు 557, దరియాలతిప్ప హైస్కూల్‌లో 1257కు 1031, కమ్యూనిటీహాలులో 1208కు 931, గిరియాంపేటలో 1462కు 1153, ప్రైమరీ స్కూల్‌లో 912కు 702, సావిత్రినగర్‌లో 848కు 731, ప్రాథమిక పాఠశాలలో 1052కు 926 ఓట్లు, కమ్యూనిటీహాలులో 1097కు 984 ఓట్లు పోలయ్యాయని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మునిస్వామి తెలిపారు.

క్లుప్తంగా

మేనకేశ్వరునికి నంది, గరుడ వాహనాల సమర్పణ


కె.పెదపూడిలో సమర్పించిన గరుడ, నంది వాహనాలు

అంబాజీపేట: మండలంలోని కె.పెదపూడిలో వేంచేసి ఉన్న మేనకేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాలకు దాతలు గరుడ, నంది వాహనాలను శుక్రవారం సమర్పించారు. గరుడ వాహనాన్ని పెయ్యేటి సూర్య వెంకట వీరభద్ర శర్మ జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు రూ.3 లక్షలతో చేయించగా, నంది వాహనాన్ని తాడిమేటి నాగభూషణరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.3 లక్షలతో చేయించి సమర్పించారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి 23న కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2024–25 సంవత్సరానికి బాలికల గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాలు కల్పించగా మిగిలిన సీట్ల భర్తీకి 23వ తేదీ మంగళవారం మండలంలోని బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.వాణీకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బొమ్మూరు, కొవ్వూరు, వీరలంకపల్లి, గోపాలపురం, జగ్గంపేట, ఏలేశ్వరం, పిఠాపురం, తుని, ఎస్ఎం నగర్, పి.వెంకటాపురం, చొల్లంగిపేట, ముమ్మిడివరం, గోడి, రాజోలు గురుకుల పాఠశాలలో 351 ఖాళీలు ఉన్నాయన్నారు. ఖాళీల వివరాలు ఎస్సీ- 220, బీసీ- 31, బీసీ సీ- 67, ఎస్టీ- 23, ఓసీ -10 సీట్లు ఉన్నాయని, వీటిని భర్తీ చేయడానికి నిర్వహించనున్న కౌన్సిలింగ్‌కు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని రావాలని ప్రిన్సిపాల్ కోరారు.

బాలుడి మృతదేహం లభ్యం


మహేష్ (ఫైల్)

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు సావరం దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద కాలువలో బాలుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అనపర్తి మండలం పేరా రామచంద్రపురానికి చెందిన పప్పు దుర్గా మణకంఠ మహేష్ (15) అనే బాలుడు మండలంలోని కొమరిపాలెం వద్ద ఈ నెల 17వ తేదీన కాలువలో ఈతకు దిగి గల్లంతయ్యాడన్నారు. మూడు రోజుల గాలింపు అనంతరం మృతదేహం లభ్యమైందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి సీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు.

నన్నయలో యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ద్వారా నిర్వహిస్తున్న పీజీ డిప్లమా ఇన్ యోగా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా సహకారంతో ఈ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఏడాది కాలవ్యవధితో కూడిన ఈ కోర్సుకు సంబంధించి 50 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న ఏదైనా డిగ్రీ కోర్సు పూర్తి చేసిన యువతీ, యువకులు మే ఆరో తేదీ లోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు, సిబ్బందికి రూ.ఆరు వేలు, ఇతరులకు రూ. 10 వేలు కోర్సు ఫీజుగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చునని ప్రకటనలో పేర్కొన్నారు.

శుభస్య శీఘ్రం..!

- విజయమే లక్ష్యంగా ఎన్నికల సమరానికి అభ్యర్థులు
- మంచి ముహూర్తం కోసం ఆరాటం
- మిగిలింది ఇక నాలుగు రోజులే
- 25వ తేదీ నామినేషన్లకు గడువు



అలమూరు: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో రాజకీయ నేతలు తమ సెంటిమెంట్‌ను జోడిస్తున్నారు. తమ నామ, నక్షత్రాలను బట్టి ముహూర్తాలను నిర్ణయించుకుని నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. తమ ఆస్థాన పండితుల చేత ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తమ నామినేషన్లకు ముహూర్తాలను నిర్ణయించుకుని ఆ దిశగా చర్యలు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అధికార పక్షమైన వైఎస్సార్ సీపీతో పాటు టీడీపీ, జనసేన కూటమి, కాంగ్రెస్, బీఎస్పీ, జైభీమ్ భారత్ పార్టీల అభ్యర్థులు తమ గెలుపును ఆకాంక్షిస్తూ ఇప్పటికే ముహూర్తాలు ఖరారు చేసుకున్నారు. ఈ మేరకు భారీ జన సందోహం మధ్య ఆ ముహూర్త వేళలో నామినేషన్లపై సంతకం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీతో ముగుస్తుండగా 21వ తేదీ ఆదివారం కావడంతో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఇంకా నాలుగు రోజుల గడువు మాత్రమే ఉంది. అయితే ఈ నాలుగు రోజుల్లో నక్షత్ర, నామధేయాన్ని బట్టి ముహూర్తాలు ఉన్నాయని పంచాంగకర్తలు చెబుతున్నారు. గంటల పంచాంగాన్ని బట్టి ఈ నెల 26 వరకూ బ్రహ్మాండమైన శుభకార్యాలు, పెళ్లి ముహూర్తాలు ఉండగా 27న శుక్ర మౌఢ్యమి ప్రవేశిస్తుంది. అయితే రాష్ట్రంలో నామినేషన్ల పక్రియ 25నే ముగియనుండటంతో మంచి ముహూర్తాలకు ఇబ్బంది లేదు. ఒక వేళ ఇదే సమయంలో మౌఢ్యమి సంభవిస్తే పెట్టుడు ముహూర్తాలను నిర్ణయించుకోవలసిన పరిస్థితి నెలకొనేది.

పురోహితులు, పండితులు చెప్తున్న శుభ ముహూర్తాలను పరిశీలిస్తే.. ఈనెల 20వ తేదీన ఉదయం పది నుంచి 11.20 గంటల మధ్య మంచి ముహూర్తం ఉందని చెప్తున్నారు. అలాగే ఈ నెల 22న ఉదయం 9.15 నుంచి 11.15 వరకూ, మధ్యాహ్నం 12.53 నుంచి 2.40 వరకూ, 23న ఉదయం 10.20 ఉంచి 11.20 వరకూ, మధ్యాహ్నం 2.50 నుంచి 4.34 వరకూ, ఈ నెల 24న ఉదయం 9.15 నుంచి 11.00 వరకూ, మధ్యాహ్నం 2.18 నుంచి 4.01 వరకూ, 25న మధ్యాహ్నం 11.00 నుంచి 12.00 వరకూ, 12.12 నుంచి 1.52 వరకూ శుభ ముహూర్తాలు ఉన్నాయని సూచిస్తున్నారు. ఆదివారం మంచి ముహూర్తం ఉన్నా ఆ రోజు సెలవు కావడంతో నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు ముహూర్త బలం బాగున్నా ఆ అవకాశం లేకపోవడం కొంత మంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్ల దాఖలులో ఆచితూచి అడుగు

సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు. ఇంటి నుంచి బయలు దేరే సమయంతో పాటు నామినేషన్ల పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేసే సమయం, నామినేషన్ల సెట్‌పై సంతకాల చేసే సమయంలో కూడా మంచి ముహూర్తం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ ఏదైనా, కులమతాలు ఏమైనా ముహూర్త బలం ఉంటేనే కాని నామినేషన్ల దాఖలకు ఒక అడుగు కూడా ముందుకు వేసే పరిస్థితి కనిపించడం లేదు.

22వ తేదీనే అధికంగా ముహూర్తాలు

2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి హిందూ పంచాంగం ప్రకారం ఈ నెల 22నే నామినేషన్లు వేసేందుకు మంచి ముహూర్తం ఉందని పంచాంగకర్తలు చెబుతున్నారు. జిల్లాలో వివిధ పార్టీలకు చెందిన నేతలు తమ అభ్యర్థిత్వానికి అదే రోజు ముహూర్తం కావడంతో ఆ సమయంలో నామినేషన్ దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. అభ్యర్థుల గెలుపు ఓటములను ముహూర్త బలాలు ఏవిధంగా నిర్ణయిస్తాయో వేచి చూడాల్సిందే. పండితులు మాత్రం అందరినీ విజయీభవ అని దీవించి పంపుతున్నారు.

అడ్డదారే మృత్యు మార్గమైంది

ఎర్రకాలువ నీటిగుంటలో ఉపాధి కూలీ మృతి


ఎర్రకాలువ నీటిగుంటలో పడి మృతిచెందిన మారయ్య

నల్లజర్ల: ఇంటి దగ్గర ఆవు ఈనుతోందని కబురు రావడంతో ఉపాధి కూలీ మద్రి మారయ్య (57) అడ్డదారిన గమ్యాన్ని చేరడానికి ప్రయత్నించి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు మారయ్య శనివారం ఉదయాన్నే ఉపాధి పనికి వెళ్లాడు.ఇంటి దగ్గర ఆవు ఈనుతోందని సమాచారం రావడంతో హడావిడిగా బయలుదేరాడు. మార్గం మధ్యలో ఎర్రకాలువ అడ్డుగా ఉంది. తిరిగి రావాలంటే 3 కిలోమీటర్ల దూరం నడవాలి. దీంతో దగ్గర దారి ఎంచుకున్నాడు. తీరా కాలువలోకి దిగే సరికి నీటి గుంట లోతు ఎక్కువగా ఉందనే విషయాన్ని గమనించేలోగా మునిగిపోయాడు. సమీపంలో పశువుల కాపరులు ఈ విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సాయంతో మారయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. మారయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పోటెత్తిన వాడపల్లి వెంకన్న ఆలయం



భక్తులతో పోటెత్తిన ఆలయం

- రూ.35.11 లక్షల ఆదాయం
- ఏర్పాట్లు చేసిన అధికారులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులు పోటెత్తింది. స్వామి వారు భక్తులకు పూర్ణ అలంకరణలో దర్శనమిచ్చారు. రాష్ట్ర నలుమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలోని క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరుని సైతం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కల్యాణాలకు, ఏడు వారాల ప్రదక్షిణలకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసింది. డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రత్యేకదర్శనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.35,11,556 ఆదాయం సమకూరిందని, అన్నసమారాధనలో వేలాది మంది పాల్గొన్నారని ఈఓ తెలిపారు.


ప్రత్యేకాలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

శోభాయమానంగా పొన్నవాహనోత్సవం

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం పొన్నవాహనోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రత్నగిరిపై ధ్వజస్తంభానికి పుష్పాధివాసం


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో భాగంగా పూజలు, హోమాలు చేస్తున్న పండితులు

అన్నవరం: సత్యదేవుని ఆలయంలో నూతన స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ఠకు పూజలు, హోమాలు సాగుతున్నాయి. పాత ధ్వజస్తంభం నుంచి సేకరించిన కళలకు శనివారం పుష్పాధివాసం చేశారు.

సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ దంపతులు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ వ్యయాన్ని భరిస్తున్న నెల్లూరుకు చెందిన భక్తుని దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమంద్ర శర్మ, ముష్టి పురుషోత్తం, వ్రతపురోహిత ప్రముఖులు వైదిక కమిటీ సభ్యుడు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి, ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు శర్మ, సుధీర్ తదితరులు పూజలు నిర్వహించారు.

నేడు ధాన్యాదివాసం

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భాగంగా ఆదివారం ధ్యాన్యాధివాసం నిర్వహించనున్నారు. 22వ తేదీ ఉదయం 10.48 గంటలకు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. అనంతరం ఆ స్తంభానికి రాగిరేకు అమర్చి తదుపరి స్వర్ణరేకు తాపడం చేయనున్నారు. ఎన్నికల నిబంధనల కారణంగా ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకావడం లేదు.

ఫలితమేదైనా భవితకు బాటలేద్దాం

- ఆందోళన అనర్థాలకు హేతువు
- మార్కులు ప్రామాణికం కానేకాదు
- పదవ తరగతితోనూ ఉద్యోగాలు



రాయవరం: జిల్లాలో విద్యార్థులు పలు పరీక్షలు ఎదుర్కొన్నారు. వాటిలో జీవితంలో మొదటిది పదో తరగతి. సోమవారం ఆ పరీక్ష ఫలితాలు రాబోతున్నాయి. ఈ ఫలితాల అనంతరం పాలిటెక్నిక్, ఇంటర్మీడియేట్, ఐటీఐ వంటి కోర్సుల్లో చేరడానికి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సుల్లో చేరడానికి సమాయత్తం కావాల్సి ఉంది. ఇంటర్ ఫలితాలు ఇప్పటికే విడుదల కాగా, పదో తరగతి ఫలితాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఫలితం తారుమారైతే కొంపలు అంటుకుపోయేదేమీ లేదని విద్యార్థులు గ్రహించాలి. తదుపరి కార్యాచరణకు సమాయత్తం కావాలి. చదువు కొనసాగించాలా.. ఎలా ప్రణాళిక వేసుకోవాలి.. లేదా ఉన్న చదువుతోనే ఉపాధి వెతుక్కోవాలా.. అవకాశాలు ఎక్కడ ఉంటాయి తదితర అంశాలపై విద్యావేత్తలు పలు సూచనలిస్తున్నారు.

మళ్లీ ప్రయత్నించాలి

పరీక్షలు బాగానే రాసినా ఫలితంపై ఆందోళన అందరిలోనూ ఉంటుంది. వాటి ప్రభావంతో పలువురు విద్యార్థులు కుంగుబాటుకు గురవుతుంటారు. అయినా కుంగిపోకుండా మరోసారి ధైర్యంగా ప్రయత్నించాలి. తల్లిదండ్రులు పిల్లల భవితపై ఆశతో, విద్యా సంస్థల యాజమాన్యాలు వాటి ప్రగతికి ఆరాటపడుతుంటారు. ప్రాచుర్యం కోసం మంచి ఫలితాల కోసం ఆరాటపడుతుంటారు. దీంతో ఒత్తిడికి గురవుతారు. అయితే ఏ ప్రగతికైనా మార్కులే ప్రధానం కాదని అందరూ గుర్తించాలి.

మార్కులే ప్రామాణికం కాదు

ఫలితాల్లో మార్కులే ప్రాతిపదికగా చాలామంది భావిస్తారు కానీ, అత్తెసరు మార్కులు వచ్చినా సరే.. ఎందరో వారి జీవితాల్లో రాణించారని గుర్తించాలి. సర్టిఫికెట్లు కేవలం విద్యార్హత తెలిపేవి మాత్రమేననే విషయాన్ని గ్రహించాలి.

పదో తరగతితోనూ ఉద్యోగ అవకాశాలు

పదో తరగతి విద్యార్హతతోనూ పలు ఉద్యోగాలు సాధించవచ్చు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, రైల్వే, తపాలా తదితర శాఖల్లో ఉద్యోగాలను పొందే అవకాశముంది. ఈ విద్యార్హతతో ఉద్యోగాన్ని సాధించి, అనంతరం శాఖాపరమైన పరీక్షల్లో ప్రతిభ చూపి ఉన్నత స్థానాలకు చేరే అవకాశముంది.

వీళ్లు కదా మనకు ఆదర్శం..

మైక్రో సాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ హార్వర్డ్ యూనివర్సిటీ డ్రాపవుట్ విద్యార్థి. మొదట ట్రాఫ్-ఓ-డేటా అనే వ్యాపారానికి సహ భాగస్వామిగా ఉండేవాడు. తదనంతరం కంప్యూటర్ ప్రోగ్రామింగ్ పట్ల అభిరుచి, నైపుణ్యంతో తన వైఫల్యాలను విజయాలుగా మార్చుకుని, మైక్రోసాఫ్ట్ కంపెనీకి మార్గదర్శకుడయ్యాడు. 31 ఏళ్ల పిన్న వయసులోనే బిలియనీర్‌గా మారాడు.

జుకర్‌బర్గ్

ఫేస్‌బుక్ రూపొందించిన జుకర్‌బర్గ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువును మధ్యలో నిలిపివేశాడు. చిన్నతనంలో నేర్చుకున్న ప్రోగ్రామింగ్ ద్వారా తనలో సృజనాత్మక ఆలోచనలతో ఫేస్‌బుక్‌ను రూపొందించి, అపర కుబేరుడయ్యాడు.

వాట్సప్ సృష్టికర్త

స్మార్ట్‌ఫోన్‌లో నిత్యావసరం అయిపోయిన వాట్సప్ రూపకర్త జాన్‌కౌమ్ యాహూలో ఉద్యోగం కోసం చదువును మధ్యలోనే వదిలేశారు. తల్లిని కోల్పోయి ఒంటరితనంతో బాధపడుతున్న ఆయనను స్నేహితుడు ఆదరించాడు. అతడితో కలిసి రూపొందించిన వాట్సాప్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అలాగే అబ్రహం లింకన్, థామస్ అల్వా ఎడిసన్, కల్నల్ శాండర్స్, ఫోర్డ్, నిక్ ఉజుచ్ ఇలా ఎందరో చదువుల్లో విఫలమై జీవితంలో అజేయంగా నిలిచారు.

రేపు పదో తరగతి ఫలితాల విడుదల



రాయవరం: పదో తరగతి ఫలితాలు ఈ నెల 22న విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఈ ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి.దేవానందరెడ్డి నుంచి ఈ మేరకు జిల్లాలకు ఆదేశాలు అందాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించగా, మూల్యాంకనం ఈ నెల ఎనిమిదో తేదీన ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాల్లో ఇప్పటికే ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో కేవలం 20 రోజుల్లోనే పదో తరగతి ఫలితాలు విడుదల చేయనున్నారు.